క్లుప్తంగా

బీట్ ద హీట్‌పై అవగాహన


ర్యాలీ చేస్తున్న అధికారులు

రేణిగుంట: స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని పంచాయతీల్లో బీట్ ద హీట్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రేణిగుంట పంచాయతీలోని వేణుగోపాలపురం, వడ్డిమిట్టలో సర్పంచ్ నగేషం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డీఎస్పీ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ప్రభురావు, ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, ఈఓ మణి, సచివాలయం, వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, వైద్య సిబ్బంది నాగరాజు, శివశంకర్ పాల్గొన్నారు.

నీటి తొట్టెలు ప్రారంభం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకంలో నిర్మించిన నీటి తొట్టెలను శనివారం తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ వెంకటరత్నమ్మ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నీటి తొట్టెల ఏర్పాటుతో వేసవి కాలంలో మూగజీవాలకు తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. పాడి రైతులకు ఎంతో ఉపయోగకరమని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.8.88 లక్షలు

రేణిగుంట: కరకంబాడిలోని కట్ట పుట్టాలమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.8.88 లక్షలు లభించినట్లు ఆలయ చైర్మన్ పాడి రాజేంద్ర తెలిపారు. కట్ట పుట్టాలమ్మ హుండీలో భక్తులు వేసిన కానుకలను శనివారం పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, ఆలయ చైర్మన్ పాడి రాజేంద్ర సమక్షంలో సిబ్బంది లెక్కించారు. నాలుగు నెలల హుండీ ఆదాయం రూ.8.88లక్షలు వచ్చినట్లు తెలిపారు.

రీ సర్వేలో బండిబాట


సర్వే చేస్తున్న అధికారులు

తొట్టంబేడు: మండలంలోని బోనుపల్లిలో రీసర్వేలో భాగంగా గ్రామస్తులు ఇచ్చిన అర్జీల మేరకు బండిబాటను శనివారం కొలిచి ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ గ్రామస్తులు ఇచ్చిన అర్జీల మేరకు పొలాల మధ్య ఉన్న బండిబాటను సర్వే చేసి చూపించామన్నారు. ఎంతోకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. సర్వేయర్ హరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గిరిజన కాలనీ వద్ద కేటీరోడ్డుపై శనివారం ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బుచ్చినాయుడుకండ్రిగ నుంచి మతకాముడి గ్రామానికి వెళ్తున్న ట్రాక్టర్ కాంపాళెం గిరిజన కాలనీ వద్ద కేటీ రోడ్డు మలుపులో బోల్తా పడింది. ట్రాక్టరులో ముగ్గురు ఉండగా, ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో వీరిని శ్రీకాళహస్తిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చలివేంద్రం ప్రారంభం


పిల్లలకు తాగునీటిని అందిస్తున్న సీఐ

సత్యవేడు: మండలంలోని బిలీవ్-ఎఫెక్టివ్ సర్వీస్ ట్రస్టు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ మురళీనాయుడు ప్రారంభించారు. శనివారం అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ట్రస్టు అధ్యక్షుడు శరవణ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ట్రస్టు ట్రెజరర్ కృష్ణవేణి, సభ్యులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి


కార్యకర్తలతో మాట్లాడుతున్న అపరంజిరాజు

నాగలాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు తెలిపారు. శనివారం ఆయన గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియలో భాగంగా టీపీ కోట, టీపీపాలెం, బీరకుప్పం, కడివేడు గ్రామాల నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు శ్యామ్, జగదీష్ రెడ్డి, మోహన్ మొదలియార్, దానవేలు, ఈశ్వర్, బాబు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


డాక్టర్ ప్రశాంత్

వరదయ్యపాళెం: మండలంలోని చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా శనివారం ప్రశాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ అనిత ఉన్నత చదువులకు ఎంపిక కావడంతో ఆమె స్థానంలో ఆయన్ను నియమించారు. ఈ మేరకు ఆయన కదిరి నుంచి బదిలీపై వచ్చారు.

కుట్టు శిక్షణ.. కుటుంబ పోషణ

వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలు. వీరు వంటింటికే పరిమితం కాకుండా కుట్టు శిక్షణను కుటుంబ పోషణకు ఉపయోగించుకోవాలని కంకణం కట్టుకున్నారు. కుటుంబసభ్యుల సంపాదనతో ఇంటిని నెట్టుకు రావడం కష్టంగా మారుతున్న కాలంలో మహిళలు వివిధ వృత్తులపై ఆసక్తిని పెంచుకుంటున్నారు. పెరుగుతున్న ఖర్చులు దృష్టిలో పెట్టుకొని దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్నచోటే ఉపాధి కల్పించే కట్టుమిషన్‌పై మక్కువ చూపుతున్నారు. కుట్టు శిక్షణ పొంది కుటుంబ పోషణలో భాగస్వాములు కావాలనే స్ఫూర్తితో శిక్షణ పొందుతున్నారు. బీసీ కార్పొరేషన్ శిక్షణ కేంద్రాలు మహిళలకు అండగా నిలుస్తున్నాయి.


కేంద్రంలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు


దుస్తుల కటింగ్‌పై శిక్షణ ఇస్తున్న ట్రైనర్

- శిక్షణపై ఆసక్తి చూపుతున్న మహిళలు
- కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు

సత్యవేడు: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని వెలుగు కార్యాలయ ఆవరణలో బీసీ కార్పొరేషన్ సహకారంతో కుట్టు మిషన్‌పై శిక్షణ ఉచితంగా ఇస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి మొదటి విడతలో 140మంది మహిళలు ఈ శిక్షణ పొందుతున్నారు. ఇది 90 రోజుల శిక్షణ తరగతులకు ఉదయం 70, మధ్యాహ్నం 70 మంది హాజరవుతున్నారు. శిక్షణలో మెలకువలు నేర్పిస్తున్నామని ట్రైనర్ పి.రాజారమణి చెబుతున్నారు. ఇప్పటికే మహిళలు కుట్టు శిక్షణపై పట్టుసాధించామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కుట్టుమిషన్ ఉచితంగా ఇవ్వాలి

స్వయం సంఘాల మహిళలకు మొదటి విడతలో 140 మందికి శిక్షణ ఇస్తున్నారు. కుట్టు మిషన్లు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు. కొత్త డిజైన్లతో ఆకర్షణీయంగా దుస్తులను సిద్ధం చేశారు. చిన్నారులకు సంబంధించిన దుస్తులు కుట్టడంలో మెలకువలు తెలుసుకున్నారు. అయితే రవికెలు, పిల్లలు దుస్తులు కుట్టడం నేర్చుకునేందుకు అవసరమైన వస్త్రం, నూలు తామే కొనుగోలు చేయాల్సి వస్తోంది. సుమారు 20 మీటర్లు దుస్తులు తాము కొనాల్సి వస్తోందని మహిళలు వాపోయారు. దీంతో మండల పరిధిలో దూర ప్రాంతాల నుంచి వచ్చిపోయే మహిళలకు బస్సు చార్జీల భారం పడుతోందని వాపోయారు. ప్రభుత్వం శిక్షణలో ఉన్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే మేలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రం వద్ద చిన్న పిల్లలు ఉండేందుకు ప్రత్యేక గది ఏర్పాటుచేసి ఒక ఆయాను నియమించాలని కోరుతున్నారు. ఉచితంగా కుట్టుమిషన్ అందించాలని కోరుతున్నారు.


శిక్షణలో కుట్టిన డిజైన్ల దుస్తులు

చేయూతనిస్తూ..



నిత్యావసరాల ధరలు పెరిగాయి. పిల్లల పాఠశాల ఫీజు, ఇతర ఖర్చులు పెరిగాయి. కుటుంబ పోషణ భారంగా ఉంది. కుట్టు శిక్షణ నేర్చుకుంటే చేదోడు వాదోడుగా ఉంటుంది. కుటుంబానికి ఆర్థికంగా చేయూత నివ్వాలనే లక్ష్యంతో నేర్చుకుంటున్నా. ఇంటి వద్దే చిన్న పిల్లల దుస్తులు, మహిళలకు సంబంధించిన పలు దుస్తులు కుట్టి కుటుంబానికి ఆసరాగా ఉంటా.

–పి. మీనా, నరసరాజు అగ్రహారం, సత్యవేడు

కుట్టు శిక్షణ బాగుంది



మండల పరిషత్ ప్రాంగణంలోని స్వయం ఉపాధి కార్యాలయం ఆవరణలో కుట్టు శిక్షణ బాగుంది. నేను ఇంటి పని అయిన తరువాత ఇంట్లో ఖాళీగా ఉండకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా. ఈ కుట్టు శిక్షణలో మెళకువలను, రకరకాల డిజైన్లు నేర్చుకున్నా. సరికొత్తగా దుస్తులను తయారు చేస్తున్నాం. ఇది పది మందికీ నేర్పవచ్చు.

–టి. దేవి, ఎన్ఆర్ అగ్రహారం, సత్యవేడు

స్వయం ఉపాధి తప్పనిసరి



విద్యార్థి దశలోనే స్వయం ఉపాధి వైపు విద్యార్థినులు దృష్టి సారించాలి. పాఠశాలల్లోనే ఇలాంటి కుట్లు, అల్లికలు వంటి చేతిపనులు నేర్చుకొంటే భవిష్యత్ బాగుంటుంది. స్వయం ఉపాధి కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్న చదువులు చదువుకోలేని వారికి ఇలాంటి కుట్టు శిక్షణ కేంద్రాలు ఉపయోగపడతాయి.

–టి. నిహారిక నరసరాజు అగ్రహారం, సత్యవేడు

ఆదరణ బాగుంది



కుట్టు శిక్షణకు మహిళలందరూ క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. ఈ శిక్షణకు మహిళలందరూ ఆసక్తి చూపుతున్నారు. ఆదరణ బాగుంది. కుటుంబ పోషణకు, మహిళలు ఆర్థిక సాధికారత సాధించడానికి ఉపయోగపడుతుంది. ఇంటి వద్దే స్వయం ఉపాధి పొందుతూ పది మందికి నేర్పవచ్చు. మహిళలు దుస్తులు చకచకా కుట్టేస్తున్నారు.

–పి. రోజారమణి, బీసీ కాలనీ, సత్యవేడు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

శ్రీకాళహస్తి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ నాగార్జున రెడ్డి అన్నారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పోలీసు సిబ్బంది స్టేషన్లో, ఆవరణలో పరిశుభ్రం చేశారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలకు వెళ్లే మార్గాన్ని సూచించే బోర్డును ఏర్పాటు చేయాలని సర్పంచ్ వెంకటమ్మ, గ్రామస్తుడు సంతోష్ శనివారం ఎంపీడీఓ వెంకటరత్నమ్మకు వినతి పత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ వెంకటరత్నమ్మ మాట్లాడుతూ బోర్డులను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఈతకెళ్లి యువకుడి మృతి


ఆంథోని సుసైన్ (ఫైల్)

రేణిగుంట: విమానాశ్రయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న యువకుడు సెలవు ఉండడంతో స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొడదామని బావిలోకి దిగడంతో బావిలోని పూడికలో ఇరుక్కొని తన కుమారుడు మృతి చెందాడని తల్లి బోరున విలపిస్తూ రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు రేణిగుంట పంచాయతీ జ్యోతినగర్‌కు చెందిన ఆంథోని సుసైన్(27) అనే యువకుడు తన నలుగురు స్నేహితులతో కలిసి శుక్రవారం మండలంలోని మామండూరు గ్రామ సమీపంలోని లక్ష్మమ్మ బావి వద్దకు ఈత కొట్టడానికి వెళ్లారు. సాయంత్రం బావిలో ఈత కొడుతున్న సమయంలో ఆంతోని సుసైన్ బావిలోని పూడికలో ఇరుక్కొని బయటికి రాకపోవడంతో స్నేహితులు అతన్ని కాపాడేందుకు ప్రయత్నించారు. ఎంతటికీ అతని ఆచూకీ తెలియక పోవడంతో రేణిగుంట పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి అవడంతో శనివారం ఉదయం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు విచారిస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


నాయకులు, కార్యకర్తలతో నూకతోటి రాజేష్

నారాయణవనం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని, పార్టీ మీకు అండగా ఉంటుందని సత్యవేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. శనివారం ఆయన నారాయణవనంలో పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి అన్నాదొరై నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి, అధికార పార్టీ నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనే వారికి అండగా ఉంటూ రక్షించుకుంటామని తెలిపారు. పార్టీకి మూలస్తంభాలు మీరే అంటూ ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్‌కిరణ్, సర్పంచ్‌లు సాయిరవి, నాగూరు, సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రవి, పొన్నుస్వామి, పార్టీ నాయకులు గురుస్వామి, దొరైరాజ్, కేజీ రవి, పీజీ బాబు, తిరువేంగడం, అశోక్ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు టెన్త్ ప్రశ్నపత్రాలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు శనివారం బుచ్చినాయుడుకండ్రిగలో పోలీసుస్టేషన్‌లో చీఫ్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, డిపార్టుమెంట్ అధికారి చలం భద్రపరిచారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాలకు సంబంధించి ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అన్ని పరీక్షలు కలిపి 312 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.


గయాజ్ ఇంటి వద్ద బియ్యపు మధుసూదన్‌రెడ్డి

స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ


ర్యాలీ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది


ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ పోతుమానుగుంట ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం అటవీశాఖ అధికారులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. డీఆర్‌ఓ సికిందర్‌బాబు ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది, వన సంరక్షణ సమితి ప్రతినిధులు స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ చేసి ప్రతిజ్ఞ చేశారు. ఎఫ్‌బీఓ శోభారాణి, పురుషోత్తం, వీఎస్ఎస్ చైర్మన్ గురువారెడ్డి, వీఎస్ఎస్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైనారిటీ నేతలకు నివాళి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన మైనారిటీ నేత గయాజ్ శనివారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఎత్తుబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు సిరాజ్, గోరా, పఠాన్ ఫరీద్, ఫజల్, గఫూర్, జిలానీ, షర్మిలా ఠాగూర్, జుంలేషా, జబ్బార్, అస్లాం, రామచంద్రారెడ్డి, లిలాకుమార్, శరవణకుమార్, మున్నారాయల్, పెరుమాల్, రమేష్ నివాళులర్పించారు.

దినకర తేజా.. గోవిందా


సూర్యప్రభ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడు,


చంద్రప్రభ వాహనంపై శ్రీవారు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వెలుగును నింపే దినకరుడిని, రాత్రి చల్లని వెలుగుతో నింపే చంద్రుడిని వాహనంగా చేసుకుని కల్యాణ వెంకన్న భక్తుల గోవింద నామస్మరణ, కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ దర్శనమిచ్చారు. వేకువజామున 5 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యకైంకర్యాలను పూర్తి చేసి, తొలి గంటతో ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం 7.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై విశ్వరూప దర్శనధారి త్రివిక్రమునిగా శ్రీవారు అధిష్టించి పుర వీధుల్లో దర్శనమిచ్చారు. మహిళలు కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం ఉత్సవర్లకు సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఊంజల్‌సేవ అనంతరం రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు ఊరేగుతూ కటాక్షించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్ పాల్గొని పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం 7.45 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. సాయంత్రం మాడ వీధిలో క్షత్రియ వేషధారుడైన శ్రీవారి అశ్వవాహన సేవ అనంతరం ఆర్జిత కల్యాణోత్సవం 8.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఆర్జిత కల్యాణంలో పాల్గొనే దంపతులు రూ.1000 చెల్లించి పాల్గొని, తీర్థ ప్రసాదాలను అందుకోవాలని నాగరాజు తెలిపారు.

నిబద్ధతతో పనిచేయాలి


సెక్యూరిటీ గార్డులతో మాట్లాడుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సెక్యూరిటీ గార్డులు విధుల్లో నిబద్ధతతో పనిచేయాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలోని బ్రహ్మగుడి వద్ద సెక్యూరిటీ గార్డులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ భద్రత, అనుమానిత వ్యక్తుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను, విధుల్లో పాటించాల్సిన నియమాలను వివరించారు. కాగా ఆలయ సెక్యూరిటీ గార్డుల నిర్వాహకంపై ఇటీవల సాక్షిలో వచ్చిన కథనంతో పోలీసులు ఆలయ సెక్యూరిటీ గార్డులకు అవగాహన కల్పించి సూచనలు ఇచ్చారు. సీఐ గోపి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల ధరల పట్టిక బోర్డులు తప్పనిసరి


మాట్లాడుతున్న ఏడీఏ సుబ్రమణ్యం

సత్యవేడు: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించే దుకాణాదారుల షాపుల ఎదుట తప్పనిసరిగా ధరలు పట్టిక, నిల్వ వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలని ఏడీఏ సుబ్రమణ్యం కోరారు. శనివారం వ్యవసాయ కార్యాలయంలో సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరు మండలాల్లో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఖరీఫ్‌కు ముందస్తుగా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు తెచ్చి ఉంచుకోవాలని సూచించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేని పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రైతు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు బిల్లు తప్పక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓలు మురళి (సత్యవేడు) గౌరి (వరదయ్యపాళెం), సంజీవరెడ్డి(పిచ్చాటూరు) డీలర్లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రేణిగుంట: రేణిగుంట పంచాయతీలోని పారిశ్రామికవాడలోని మురుగు కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు. స్థానిక వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండడం దుర్వాసన వెదజల్లుతుండడంతో మృతి చెంది నాలుగు రోజులు పైగా ఉంటుందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. మృతుడికి సుమారు 35, 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని గ్రీన్ కలర్ ఫుల్ షర్టు, సిమెంట్ కలర్ ప్యాంట్‌ను ధరించి ఉన్నాడని, సిల్వర్ కలర్ లాంటి కడియం, మెడలో చైన్ ఉన్నాయన్నారు. అతడి వద్ద ఊరు పేరుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడు ఆచూకీ తెలిసినవారు రేణిగుంట అర్బన్ పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

వన సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వండి


సత్యవేడు కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న పనులను పరిశీలిస్తున్న జడ్జి వెంకటనాగరాజు


కేవీబీపురంలో ర్యాలీ..


నాగలాపురంలో..


బుచ్చినాయుడుకండ్రిగలో..

సత్యవేడు: రోడ్ల వెంట, పాఠశాల ప్రాంగణాలు, ఉద్యానవనాలు, బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు, పెంచేందుకు పంచాయతీ సిబ్బంది చొరవ చూపాలని సత్యవేడు జూనియర్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఏ.వెంకటనాగరాజు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కోర్టు ఆవరణలో, తహసీల్దారు కార్యాలయ ఆవరణలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు సిబ్బందితో కలిసి పిచ్చిమొక్కలు తొలగించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తరుణాక్షరెడ్డి, తహసీల్దారు రాజశేఖర్, ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లు రమేష్, సెక్రటరీ మునిరవికుమార్ పాల్గొన్నారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య పనులు చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాలతి పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: సర్పంచ్ చిన్నదొరై ఆధ్వర్యంలో ఎంపీడీఓ బాలాజీనాయక్ అధ్యక్షతన గ్రామ ప్రజలకు, దుకాణాదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బజారు వీధిలో గాంధీ విగ్రహం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఎంపీడీఓ వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం రేపు

కేవీబీపురం: ఆదరం పంచాయతీలో సోమవారం తిరుపతి ఎంపీ గురుమూర్తి చేతుల మీదుగా ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ సత్యవేడు నియోజకవర్గం ఐటీ విభాగ అధ్యక్షుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్ కూడా పాల్గొంటారని చెప్పారు.

ఆహార నియమాలతో రక్తపోటుకు చెక్


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

సత్యవేడు: మనిషి జీవనశైలి మారడంతో అధిక రక్తపోటు బాధితులు పెరుగుతున్నారని డాక్టర్ అరుణ్ కిషోర్ అన్నారు. ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం దాసుకుప్పం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.అధిక రక్తపోటు ఉన్నవారికి ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, ల్యాబ్‌టెక్నీషియన్ మురళిమోహన్, హెల్త్ అసిస్టెంట్ షణ్ముగనాథ్, ఆశా వర్కర్లు, గౌరి, లత, వెంకటలక్ష్మి, మునికుమారి, లలిత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆదాయం పెంచుకోండి


ఇన్‌సినిరేటర్ చాంబర్‌ను పరిశీలిస్తున్న సుశీలాదేవి

నారాయణవనం: ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించి పంచాయతీ ఆదాయాలను పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి అన్నారు. శనివారం నారాయణవనంలోని బృందావనం, హిందూ శ్మశాన వాటికలను సందర్శించారు. మండలంలోని వీకే పాళ్యంకు చెందిన మోహన్‌బాబు విరాళంగా అందించిన ఘన, ప్లాస్టిక్ వ్యర్థాలను బూడిద చేసే ఇన్‌సినిరేటర్ చాంబర్‌ను ప్రారంభించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, సర్పంచ్‌లు శారదాగణేశన్, ధర్మలింగం, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను నిర్వహించండి

నారాయణవనం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే ప్రతిరోగి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని జిల్లా ఆరోగ్య ప్రాజెక్ట్ నిర్వహణ అధికారి శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక పీహెచ్‌సీని ఆయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. మండల వైద్యాధికారి దర్శిత్ రాజ్, పీహెచ్‌సీ డాక్టర్ రాగసుధ పాల్గొన్నారు.